ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0

నామాల వాడా.. నిన్నొదలా..
» రాజీనామా ఊసెత్తని నామినేటెడ్ సభ్యులు
» ఆలయ చైర్మన్, ఎక్స్‌అఫీషియోలకు మినహాయింపు
5

నిలువెత్తు ప్రక్షాళన



జిల్లాలో బదిలీలకు వేళాయె!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాలనా యంత్రాంగంపై దృష్టి పెట్టింది. సమర్థులైన అధికారులు ఎవరనే దానిపై జాబితా సిద్ధం చేసుకుంది. ప్రభుత్వ విభాగాల్లో శరవేగంగా స్పందించి, వ్యవహరించిన వారందరిని వైసీపీ ప్రభుత్వం పక్కన పడేసింది. లేకుంటే ప్రాధాన్యత, అప్రాధాన్యత పోస్టుల్లో నియమించింది. ఇప్పుడు వారందరిని కీలక విభాగాల్లో పోస్టింగ్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రస్థాయి అధికారులను ఒకవైపు సర్దుబాటు చేస్తూ మరోవైపు జిల్లాల్లో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్‌తో పాటు కలెక్టరేట్ దగ్గర నుంచి వివిధ ముఖ్య విభాగాలు, తహసీల్దార్ల వరకు సమూలంగా మార్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

» జిల్లాస్థాయిలో అత్యధికులను పంపించే దిశగా కసరత్తు
» కీలక విభాగాల్లోను స్థానచలనం
» రెవెన్యూ, వైద్య, రిజిస్ట్రేషన్లు, పౌర సరఫరాల్లో వారిపై దృష్టి
» ఇప్పటికే కొందరి అధికారుల ముమ్మర ప్రయత్నాలు
» ఇంకోవైపు అప్రమత్తమైన ఎమ్మెల్యేలు



(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఇప్పటికే ఆయా జిల్లాల్లో పోస్టింగ్‌ల కోసం కొంత మంది ఐఏఎస్‌లు మంత్రులను కలుస్తున్నారు. వీరిలో సీనియర్, సమర్థులైన ఐఏఎస్‌లను తిరిగి కలెక్టర్‌గా నియమించే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఐఏఎస్‌లు ఉన్నారు. వీరికే సర్దుబాటు చేయాలి కాబట్టి ఆ మేరకు కసరత్తు చేసి కాస్త నిక్కచ్చిగా సమయానుకూలంగా చర్యలు తీసుకునే ఐఏఎస్‌లవైపే కూటమి మొగ్గు చూపుతోంది. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను బదిలీ చేసే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఆయన స్థానంలో ఢిల్లీ రావ్ దగ్గర నుంచి మరో ముగ్గురు ఈ తరహా పోస్టింగ్‌ను ఆశిస్తున్నారు. ఇప్పటికే ప్రసన్న వెంకటేశ్ కలెక్టర్‌గా జిల్లాలో రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. ఎలాగో బదిలీ తప్పదు కాబట్టి ఆయన దానికి సిద్ధమై నెల్లూరు జిల్లాను కోరుకున్నా అప్పట్లో ఆయన సంకల్పం సక్సెస్ కాలేదు. ఇంతకు ముందు తరచూ పశ్చిమ గోదావరి జిల్లాకు మహిళా కలెక్టర్లే ఎక్కువగా నియమితులు అయ్యేవారు. జిల్లా విభజన జరిగిన తర్వాత ఇదే ఆనవాయితీని ఈసారి ఏలూరు జిల్లాలో కొనసాగించే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు. కలెక్టర్ల బదిలీల తర్వాత జాయింట్ కలెక్టర్లు, జిల్లా స్థాయిలో వివిధ విభాగాలకు హెచ్‌వోడీలుగా ఉన్న వారిని మార్పు, చేర్పుల జాబితాలోకి చేర్చబోతున్నారు. అత్యంత కీలకమైన విభాగాల్లో ఇప్పటికే కొంత మంది చానాళ్ళుగా ఇదే జిల్లాలో హెడ్‌లుగా కొనసాగుతున్నారు. హౌసింగ్ పీడీ, డీఆర్‌డీఏ, పౌర సరఫరాల విభాగం, ఇరిగేషన్, జిల్లా పరిషత్ వంటి కీలక విభాగాల్లోనూ ప్రస్తుతం ఉన్న అధికారులను బదిలీ చేయవచ్చని సంకేతాలు అందుతున్నాయి. ఎంతవీలైతే అంత మేర అధికారులను మార్చి కొత్త వారిని నియమించాలనే లక్ష్యంలో ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొందరు అధికారులు, గెలిచిన ఎమ్మెల్యేలు, ఈ మధ్యనే బాధ్యతలు స్వీకరించిన మంత్రులను కలిశారు. వీలైతే అవసరంలో ఉపయోగపడతారన్న కారణం ఒకటైతే వారిని ప్రసన్నం చేసుకోవడానికి సామాజిక వర్గాల వారీగా ఇంకొందరు ప్రయత్నించారు. కలెక్టరేట్ ముఖ్య విభాగాల్లోనూ మార్పులు తప్పకపోవచ్చు. కలెక్టర్ తన పాలన అవసరాలు, సీనియార్టీని బట్టి కలెక్టరేట్‌లో వివిధ విభాగాలకు సీనియర్లను నియమించారు. ఇప్పుడు వీరిలో కొందరిని మార్చే అవకాశాలు ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్లు, రిజిస్ట్రేషన్ అధికారులను ఇదే దారిలో బదిలీ చేయబోతున్నారు. వాస్తవానికి మూకుమ్మడి బదిలీలకు సాధారణ సమయంలో అయితే ఏ ప్రభుత్వం అంగీకరించేది కాదు. కాని ఇప్పుడు ఉన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో అధికారులు, ఉద్యోగులు ఎవర్ని నొప్పించకుండా కొద్దిగా అటు ఇటూ స్థానచలనం చేయాలన్నదే ప్రభుత్వం సంకల్పంగా కనిపిస్తోంది. సహకార రంగం, వ్యవసాయం, పంచాయతీరాజ్ వంటి కీలక విభాగాల్లోనూ మార్పులు చేర్పులు తప్పకపోవచ్చు. వాస్తవానికి ప్రభుత్వం మారిన వెంటనే సాధారణంగా కలెక్టర్లు, ఎస్పీలతోపాటు కొద్దిమంది ముఖ్య అధికారులను తక్షణం మార్చి వారి స్థానంలో కొత్త వారిని నియమించేవారు. ఈసారి నియోజక వర్గాల వారీగా తహసీల్దార్లు, ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పనిచేసే కొందరు అధికారులు సైతం తమంతట తాముగా తుది నిర్ణయాలు తీసుకోవడం, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు చెప్పిందే చేయడం, ప్రత్యేకించి ప్రతిపక్షానికి ఎవరు సహకరించక పోవడం ప్రధానంగా సాగింది. ఈ విషయంలో కొందరు అధికారులు దూకుడుగా వ్యవహరించడం, మరికొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు చెబితే కాని చేయమని మొండికేశారు. ఈ పరిస్థితులన్నింటిని పూర్తి అధ్యయనం చేశారు. హౌసింగ్, విద్య, రెవెన్యూ, పౌర సరఫరాలు, సహకార శాఖ, వివిధ కార్పొరేషన్లు, జడ్పీ డీసీసీబీ, డీసీఎంఎస్ వంటి శాఖలు అన్నింటిలోనూ బదిలీలు అనివార్యం కాబోతున్నాయి.

ఎమ్మెల్యేలు మరింత అప్రమత్తం

బదిలీల ప్రక్రియ ప్రారంభమైన వేళ తమ నియోజక వర్గాలకు అవసరమైన అధికార బృందాల కోసం ఎమ్మెల్యేలు కొందరు అప్రమత్తమయ్యారు. ప్రధాన శాఖలకు సంబంధించిన మంత్రులతో ముఖాముఖి భేటీ అవుతున్నారు. కీలకశాఖలకు సంబంధించి తమ కిష్టమైన అధికారి లేకపోతే పాలనలో తమ వేగాన్ని అందుకోలేరని కొత్త భాష్యం చెప్తున్నారు. ఉదాహరణకు డీసీసీబీని ప్రక్షాళన చేయాలని చానాళ్ళుగా అత్యధికులు డిమాండ్ చేస్తూ వచ్చారు. కాని వైసీపీ ఎమ్మెల్యేలు, సానుకూలురు పట్టించుకోలేదు. డీసీఎంఎస్ లోను ఇలాంటి పరిస్థితే ఉంది. అయితే డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు ఛైర్మన్‌లుగా నామినేటెడ్ చేసిన వారే ఉంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఒత్తిడి ఉంటే ఈ రెండింటిలోనూ బదిలీలు సాధ్యం. ఇప్పుడు ఎలాగో ప్రభుత్వం మారింది కాబట్టి ఈ రెండింటిలోనూ కొంతమంది అధికారులకు ఈసారి స్థానచలనం తప్పదని భావిస్తున్నారు. జిల్లా పరిషత్‌లోనూ మార్పులు, చేర్పులు దిశగానే కసరత్తు సాగుతోంది. ప్రత్యేకించి జడ్పీ వైసీపీ ఆధీనంలో ఉండడంతో ఈనెలాఖరు నాటికి దీనిపైన ప్రత్యేకంగా ప్రభుత్వం దృష్టి పెడుతుందని చెబుతున్నారు. ఇంకోవైపు ఆరోగ్యశాఖకు సంబంధించి మొదటి నుంచి ఉన్న వివాదాలు, బదిలీల్లో చోటుచేసుకుంటున్న అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి ఆ శాఖల వ్యక్తులు కొందర్ని మార్చేందుకు ప్రయత్నాలు ఆరంభం అయ్యాయి.

పోలీస్ శాఖలో భారీ మార్పులు



పోలీస్ శాఖలో ఎస్పీ మేరీ ప్రశాంతి సహా అనేకమందిని మారుస్తారంటూ ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ఉన్నత స్థాయిలో ఈ మేరకు కసరత్తు జరుగుతోంది. ఎస్పీని మారిస్తే ఆమె స్థానంలో కొత్తగా వచ్చేవారు ఎవరనే దానిపై సందిగ్ధత నెలకొంది. ఈ రెండు, మూడు రోజుల్లోనే ఎస్పీలు, కలెక్టర్లు బదిలీల జాబితా వెలువడే అవకాశం లేకపోలేదు. సాధారణంగా ఒకేచోట రెండేళ్లు పూర్తి చేస్తేనే గాని ప్రత్యేకించి ఎస్పీలను, కలెక్టర్లను బదిలీచేసే అవకాశం లేదు. కాని పాలనా వ్యవహారాలను దృష్టిలో పెట్టుకుని ఈ బదిలీలు చేయబోతున్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందే ఉన్నతస్థాయి అధికారుల బదిలీలపై పేర్లతో సహా స్పష్టత రాబోతుంది. ఇక దిగువస్థాయిలో సీఐలు, ఎస్సైలను పెద్ద ఎత్తున మారుస్తారని చెబుతున్నారు. వీరిలో కొందరు అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలకు అనుకూలురుగా వ్యవహరించడం, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుంటున్నారు.



ద్వారకా తిరుమల గ్రామ పంచాయతీలో

రూ.2.25 కోట్లు స్వాహా నిజమే!

గ్రామ కార్యదర్శి, సర్పంచ్, పూర్వపు ఎంపీడీవోలే బాధ్యులు

ద్వారకాతిరుమల, జూలై 19 : వారంతా గూడు పుఠాణిగా మారారు. రూ.2.25 కోట్లకు పైగా పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారు. విచారణలో ఈ విషయం తేలినా వారిపై అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడాన్ని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ద్వారకా తిరుమల గ్రామ పంచాయతీలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త ఈ ఏడాది జనవరి 29న ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిర్వహించాలని కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేశ్ జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో రజావుల్లాను ఆదేశించడంతో ఆయన ఫిబ్రవరి 17న విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఫిర్యాదుదారు అముక్త, గ్రామ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఈవోపీఆర్‌డీ సుబ్బరాయన్ తదితరుల నుంచి వివరాలు సేకరించారు. విచారణాధికారి తన నివేదికను ఏప్రిల్ 26న జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారు. ఆ తర్వాత కార్యాలయాల చుట్టూ నివేదిక కోసం తిరిగిన అము క్తకు సమాచార హక్కు చట్టం కింద మంగళవారం అందించారు. వివరాల్లోకి వెళితే..

గ్రామ సర్పంచ్ స్వర్ణలత, కార్యదర్శి వెంకటేశ్వరరావు, అప్పటి ఎంపీడీవో ఆశీర్వాదం పంచాయతీ నిధులు రూ.2.25 కోట్లు దుర్వినియోగం చేసినట్టు తేలింది. ఐదేళ్లుగా కార్యదర్శిగా ఇక్కడే పాతుకుపోయిన వెంకటేశ్వరరావు 2019-24వరకు పంచాయతీ సాధారణ నిధుల దుర్వినియోగం, ఇంటి, కుళాయి పన్నులు ద్వారా, లైసెన్స్ ఫీజుల వసూలులో నిర్లక్ష్యం, 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం వంటి అంశాల ద్వారా కైంకర్యం చేసిన రూ.1,43,44,700 సొమ్ము వసూలు చేయాలని నివేదికలో సూచించారు. ఇదే అంశాలపై 2021 నుంచి సర్పంచ్‌గా విధులు నిర్వర్తిస్తున్న స్వర్ణలత రూ.61,28,511 దుర్వినియోగం చేశారని, ఏపీ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఆ సొమ్మును వసూలు చేయడంతోపాటు ఆమెపై చర్యలు తీసుకోవాలని సూచించారు. 2019 జూలై పది నుంచి 2021 ఏప్రిల్ 2 వరకు విధులు నిర్వర్తించిన పూర్వ ఎంపీడీవో ఆశీర్వాదం రూ.20,60,611 సొమ్ము దుర్వినియోగం చేశారని ఈ అవినీతికి ఆయనను బాధ్యులుగా నివేదికలో చూపారు. ఈ క్రమంలో వారి ముగ్గురిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంతో పాటు, పక్కదారి పట్టించిన పంచాయతీ నిధులను రాబట్టాలని సూచించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇంటర్‌కూ స్టూడెంట్ కిట్లు

» బాలికలకు మళ్లీ సైకిళ్లు?
» విద్యాశాఖలో నూతనోత్తేజానికి నాంది



ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 19 : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరిన నేపథ్యంలో పాఠశాల విద్యలో పలు సంస్కరణలు అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో భ్రష్టు పట్టిన విద్యాశాఖను ప్రక్షాళన చేసి నూతనోత్తేజంతో నింపేందుకు అడుగులు వేగవంతమయ్యాయి. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ ఈనెల 21న పదవీ బాధ్యతలు చేపట్టే నాటికి కూటమి ప్రభుత్వం ప్రాధామ్యాల కనుగుణంగా నూతన ప్రతిపాదనలకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇంటర్మీడియట్ చదువుతున్న బాల బాలికలకు స్కూలు విద్యార్థులకు ఇస్తున్నట్టుగానే కిట్‌లను పంపిణీ చేయడానికి ఇప్పటికే నిర్ణయించిన విషయం విదితమే. జిల్లాలోని 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లలో చదువుతున్న సుమారు 4,300 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరాల సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల విద్యార్థులకు తక్షణమే 6 పాఠ్యపుస్తకాలు, 12 నోట్ పుస్తకాలు, బ్యాగులను అందజేయాలని సమగ్ర శిక్ష జిల్లా అధికారులకు బుధవారం ఆ శాఖ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. పదోతరగతి చదువుతున్న పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయగా మిగిలిన స్టూడెంట్ కిట్‌లను ఇంటర్ విద్యార్థులకు పంపిణీ చేయాలని, జూలై 15లోగా పూర్తిస్థాయిలో జూనియర్ కళాశాలల విద్యార్థులందరికీ అందేలా జిల్లాలోని మండల రిసోర్స్ సెంటర్లకు సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. మరోవైపు సంక్షేమ వసతి గృహాల కళా శాలలు, కేజీబీవీలు, మోడల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలబాలికలకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేసేందుకు వీలుగా ఇండెంట్‌లను వెంటనే పంపాలని సంబంధిత విభాగాల జిల్లా అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయగా, ఆ తదుపరి గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వం వీటిని నిలిపివేసింది. ఐదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటే, బ్యాగులు, నోట్ పుస్తకాలను అందజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థినులకు సైకిళ్లు..



టీడీపీ ప్రభుత్వ పాలనలో బాలికావిద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9 తరగతులు చదివే బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసిన విషయం విదితమే. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే 2019లో సైకిళ్ల పంపిణీని వైసీపీ ప్రభుత్వం నిలిపివేయగా, పలుచోట్ల మండలాలు, పాఠశాలల్లో సైకిళ్లు సరఫరా చేయకుండా మూలన పడేయడంతో చాలావరకు తుప్పుపట్టాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సైకిళ్లపై తొలిసారిగా బుధవారం దృష్టి సారించింది. చివరిసారిగా 2018లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సరఫరా చేసిన 34,370 సైకిళ్లు పూర్తిగా బాలికలకు అందజేశారా.. లేక పంపిణీ చేయకుండా ఎన్ని సైకిళ్లు పాఠశాలల్లో నిల్వ ఉంచారనే విషయాలపై తక్షణమే సమాచారం పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. నూతన ప్రభుత్వం బాలికలకు గతంలో మాదిరిగానే మళ్లీ సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టేందుకే యోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఇంతవరకు అధికారికంగా ప్రభుత్వం ప్రకటనేదీ చేయలేదు.

కొత్తగా మరికొందరు ఎంటీఎస్ ఉపాధ్యాయులు?

ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో నష్టపోయిన డీఎస్సీ-1998 నిరుద్యోగ అభ్యర్థులను కనీస వేతన స్కేలు (ఎంటీఎస్)పై ఉమ్మడి జిల్లాలో మొత్తం 274 మందికి ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగాలను ఇచ్చిన విషయం తెలిసిందే. వీరిలో 26 మంది ఈ ఏడాది జూన్ వరకు 60 ఏళ్ల ఉద్యోగ కాలపరిమితితో రిటైర్ అయ్యారు. ఇలా ఉద్యోగ విరమణ చేసిన ఎంటీఎస్ ఎస్జీటీల స్థానే సీనియార్టీ జాబితాలో తదుపరివున్న 100 మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల నుంచి అర్హులను ఎంపికచేసి ఉద్యోగాలు ఇవ్వాలన్న ప్రతిపాదన ఒకటి తాజాగా తెరపైకి వచ్చింది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాలో ఎంటీఎస్ టీచర్ల రిటైర్మెంట్ వెకెన్సీలు ఎక్కడెక్కడ ఉన్నాయనే సమాచారాన్ని సేకరించే పనిని ప్రారంభించారు. ఎంటీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఇప్పటికే ఫైనాన్స్ అప్రూవల్ ఉన్నందున, రిటైర్ అయిన వారిస్థానే తదుపరి సీనియర్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించినా సాంకేతికంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేనందున కూటమి ప్రభుత్వం సానుకూలంగానే స్పందిస్తుందని సమాచారం.

ఇప్పుడైనా ఇస్తారా?

» పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూపులు
» నీరు - చెట్టు.. ఎస్‌డీఎఫ్ డబ్బు వచ్చేనా
» సీఎం చంద్రబాబు కనికరించాలంటున్న కాంట్రాక్టర్లు



ఏలూరు రూరల్, జూన్ 19 : వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలుగా గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వేధించింది. దీనిపై అప్పట్లో స్పందించిన చంద్రబాబు తమపార్టీ అధికారంలోకి రాగానే ఆ బిల్లుల న్నింటిని వడ్డీతో చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం కొలువుతీరింది. ఆర్థికంగా చితికిపోయిన తమకు ఇప్పు డైనా నాడు చేసిన పనులకు బిల్లులు మంజూరవుతాయా? అని టీడీపీ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతా ల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి నీరు - చెట్టు, సీసీ రోడ్లు, కాల్వలు వంటి పనులు చేశారు. ఈ పనులను టీడీపీ సంబంధీకులు చేశారనే కారణంతో వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా బిల్లులు చెల్లించలేదు. హైకోర్టు ఆదేశించినా 80 శాతం పైగా పనులకు డబ్బులు ఇవ్వలేదు. కొంతమందికి మాత్రమే బిల్లులు మంజూరు చేశారు.

ఆన్‌లైన్‌లో నీరు - చెట్టు పనులు తొలగింపు

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నీరు -చెట్టు పథకం కింద ఇరిగేషన్ శాఖ పరిధిలో చెరువులు, సాగునీటి కాల్వల్లో పూడికతీత పనులను చేపట్టారు. ఈ పనులను అప్పట్లో నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు, డైరెక్టర్లు, సభ్యులు చేపట్టారు. పూర్తిచేసిన పనులను అప్పట్లో క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసి ఎం-బుక్‌లో నమోదు చేసిన అనంతరం బిల్లుల క్లియరెన్స్ కోసం టీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతరం కొద్దిరోజులకే ఎన్నికల కోడ్ అమలు కావడంతో బిల్లులు చెల్లింపు ఆగిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నీరు -చెట్టు పనుల బిల్లులను పెండింగ్ పెట్టారు. చివరకు చేసిన పనులను ప్రభుత్వ రికార్డుల్లోనే లేకుండా తొలగించారు. ప్రస్తుతం నాడు చేసిన పనులకు ఎం-బుక్‌ల ఆధారంగా బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ఎస్‌డీఎఫ్ బిల్లుల్లోనూ కక్ష సాధింపు

టీడీపీ హయాంలో ఎస్‌డీఎఫ్ నిధులు, ఉపాధి హామీ పథకం నిధులను అనుసంధానం చేసి గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు పనులు చేపట్టారు. చేసిన పనుల్లో నాణ్యత లేదనే సాకుతో వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. కోట్లాది రూపాయలు బిల్లులు రాకుండా వైసీపీ అడ్డుకుంది. దీంతో టీడీపీ సానుభూతిపరులు నష్టపోయారు.

20 శాతం కోతతో బిల్లులు మంజూరు

టీడీపీ హయాంలో చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కొంతమంది కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో చేసిన పనిలో 20 శాతం కోత విధించి, ప్రభుత్వం బిల్లులను ఇచ్చింది. పనిచేసిన కాంట్రాక్టర్‌కు సరైన సమయంలో సొమ్ములు రాక పోవడంతో పాటు వడ్డీని నష్టపోయి నట్టు అయింది. పైగా 20 శాతం కోత విధించడంతో కాంట్రాక్టర్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. వీటితో పాటు 2014-17 వరకు చేపట్టిన ప్రభుత్వ పనులకు సంబంధించి ప్రతిపనిలో ఐదుశాతం డిపాజిట్లు కట్టుకున్నారు. పనిచేసిన అనంతరం రెండేళ్లల్లో పనిలో నాణ్యత లోపిస్తే డిపాజిట్‌లో నగదును మరమ్మతులకు ఉపయోగిస్తారు. ఐదు శాతం డిపాజిట్ సొమ్మును ఇవ్వాలని పంచాయతీరాజ్ అధికారులను, కాంట్రాక్టర్లు అడిగితే డిపాజిట్ సొమ్ము లేదని, వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసిందని సమాధానం ఇచ్చినట్టు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పోటీపడి సీసీరోడ్లు చేపట్టగా ఐదేళ్లుగా బిల్లులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. ప్రస్తుత సీఎం చంద్రబాబు కనికరించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంగిడిగూడెం దాడి ఘటనలో..

నలుగురు వైసీపీ నేతలపై కేసు

ద్వారకా తిరుమల, జూన్ 19: దివ్యాంగ టీడీపీ నేతపై దాడి చేసిన వైసీపీ అనుకూల సర్పంచ్ పత్తిపాటి మహలక్ష్ముడు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు భీమడోలు సీఐ బి.రవికుమార్ తెలిపారు. ద్వారకా తిరుమల పోలీస్ స్టేషన్‌లో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పంగిడిగూడెంకు చెందిన టీడీపీ మండల కార్యదర్శి కాలి అశోక్ అనే దివ్యాంగుని వైసీపీకి చెందిన కొందరు మానసికంగా వేధించడంతో పాటు పై నలుగురు పాతకక్షలను పురస్కరించుకుని మంగళవారం దాడి చేశారన్నారు. క్షతగాత్రుడు భీమడోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పత్తిపాటి మహలక్ష్ముడు, గుమ్మడి శ్రీను, గుమ్మడి బుచ్చయ్య, గుమ్మడి దేవయ్యలపై ఐపీసీ సెక్షన్లు 341, 323, 506, 34 మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుల రాక : కలెక్టర్

ఏలూరు సిటీ, జూన్ 19 : ఇటీవల సార్వత్రిక ఎన్నికలలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు తుది అకౌంట్స్‌ను వ్యయ పరిశీలకులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి అభ్యర్థుల ఎన్నికల వ్యయం, ఇతర ఎన్నికల అంశాలపై రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెలలో వ్యయ పరిశీలకులు జిల్లాకు రానున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయ ఖర్చుకు సంబంధించి అభ్యర్థి వారీగా సక్రమంగా తుది అకౌంట్స్ వ్యయ పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గాల వారీగా ఎన్నికలకు సంబంధించిన నిధుల విడుదల, వ్యయం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో ఎం. సూర్యతేజ, డీఆర్వో పుష్పమణి, ఆర్వోలు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇక ఇసుకపై..

కెమెరా కన్ను..!

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ఇసుక ర్యాంపుల వద్ద సీసీ కెమెరాలు

బుట్టాయగూడెం/కుక్కునూరు జూన్ 19 : కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని కుక్కునూరు, వేలేరుపాడు ఏజెన్సీ మండలాల్లోని ఇసుక ర్యాంపుల వద్ద అక్రమ ఇసుక రవాణా జరగకుండా ఉండేందుకు బుధవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. గత నెలలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, మైనింగ్ అధికారులు ఇసుక ర్యాంపుల వద్ద పర్యటించారు. అక్రమ ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే సోలర్ సిస్టమ్ ద్వారా సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కుక్కునూరు మండలంలోని దాచారం, వింజరం, ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌ల వద్ద, వేలేరుపాడు మండలం రుద్రమకోట రీచ్‌లో సోలార్ విధానంతో పని చేసే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి రెవెన్యూ సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ చర్యలు తీసుకు న్నట్టు పీవో తెలిపారు. ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా జరిగితే బాధ్యు లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కాగా కుక్కునూరు తహసీల్దార్ అచ్యుత కుమారి, ఆర్ఐ వెంకట్, వీఆర్వో ఇబ్రహీం, ఇసుక ర్యాంపుల వద్ద పర్యటించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిశీలించారు.





వింజరం ఇసుక ర్యాంపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన దృశ్యం



ఆగర్తిపాలెంలో డ్రెయిన్, పంట కాల్వలను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

జగన్‌కు అధికారమే తప్ప.. సేవపై ధ్యాస లేదు

» డ్రెయిన్లు, పంట కాల్వల ప్రక్షాళన పనులు చేపట్టాలి

» అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం

పాలకొల్లు టౌన్, జూన్ 19 : జగన్‌కు అధికార దాహం తప్ప రైతులకు సేవ చేసే ధ్యాస లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఇరిగేషన్, డ్రెయినేజీ, కన్జర్వేన్సీ శాఖల పనితీరుపై ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలంలో వ్యవసాయం ముంపు బారిన పడకుండా పంట కాల్వలు, మురుగు డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులు యుద్ధప్రాతిపదిక చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పరివాహక గ్రామాల్లో బలహీనంగా ఉన్న ఏటిగట్ల పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంట కాల్వలు, మురుగు డ్రెయిన్లు, గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులను గాలికొ దిలేసిందన్నారు. అన్నదాతను నిర్లక్ష్యం, దగా చేసినందువల్లే జగన్‌కు పకృతి శపించి పదకొండు సీట్లకే పరిమితం చేసిందన్నారు. సమావేశంలో ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాస్, ఈఈ ఎం.దక్షిణమూర్తి, డీఈలు శ్రీనివాసు, సత్యనారాయణ, ఏఈలు బి.మోహన్‌కృష్ణ, జి.జయశంకర్, కె.శ్రీనివాసు, దుర్గారావు, రమణారావు, ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆగర్తిపాలెం ప్రాంతంలో తూడు, గుర్రపు డెక్క దట్టంగా పేరుకుపోయిన డ్రెయిన్లు, పంట కాల్వలను ఆయన పరిశీలించారు. మంత్రి వెంట నాయకులు, రైతులు ఉన్నారు.

పెద్దింట్లమ్మ హుండీ ఆదాయం రూ.7.63 లక్షలు



ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కైకలూరు, జూన్ 19: కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించగా 7 లక్షల 63 వేల 447 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కేవీ గోపాలరావు తెలిపారు. బుధవారం ఎండోమెంట్ తనిఖీ అధికారి వి. సుధాకర్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపును నిర్వహించారు. 62 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో కొబ్బరి చెక్కలను పోగుచేసుకునే హక్కు కోసం వేలం నిర్వహించగా పాటదారులు ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

ఆ పోలీసులపై చర్యలు చేపట్టండి..



హోంమంత్రి అనితతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

నూజివీడు టౌన్, జూన్ 19: గత ప్రభుత్వం హయాంలో రైతులపై అక్రమ కేసులు పెట్టిన పోలీసులపై చర్య తీసుకోవాలని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ కోరారు. బుధవారం అమరావతి సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను కలసిన ఆయన మల్లవల్లి ఇండస్ట్రీయల్ కారిడార్ భూ నిర్వాసిత రైతుల విషయమై మాట్లాడారు. గత ప్రభుత్వంలో రైతులపై లాఠీచార్జ్ చేసి గాయపరిచి, అక్రమంగా హత్యా కేసులు నమోదు చేశారని, ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకో వాలని కోరారు. జనసేన నాయకుడు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో హోటళ్ల యజమానులకు టోకరా

మొగల్తూరు, జూన్ 19 : ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌నంటూ ఒక వ్యక్తి హోటల్ యజమానులకు టోకరా వేసిన ఘటన మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో జరిగింది. స్థానికంగా కట్టా త్రిమూర్తులు వినాయక రెస్టారెంట్‌ను, ఆయన కుమారుడు నాని అమ్మ టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఆ హోటల్స్‌కు ఈనెల 16వ తేదీన ఓ వ్యక్తి వచ్చి తాను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను, హోటల్‌లో పరిశుభ్రత లేదు. మీ హోటల్స్‌పై కేసు నమోదు చేస్తాం లేకుంటే జరిమానా చెల్లిస్తే సరిపోతోంది. ఈమేరకు రసీదు కూడా ఇస్తామని నమ్మబలికాడు. వ్యాపార సమయం కావడంతో వారు జరిమానా చెల్లిస్తానని చెప్పడంతో ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.రూ.1416 చొప్పున చెల్లించడంతో సదరు వ్యక్తి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన ఇండియన్ ఫుడ్ సొల్యూషన్స్ సంస్థకు చెందిన రసీదు ఇచ్చి ఉడాయించాడు. ఆదే సమయంలో హోటల్‌కు వచ్చి ఒక కస్టమర్ అతడు మోసగాడు అని కొత్తోట ప్రాంతానికి చెందిన వాడని నిరంతరం చిరు వ్యాపారులు, గల్ఫ్ వెళ్ళే వారిని మోసం చేసే వ్యక్తి అని యజమానులకు చెప్పడంతో వారు ఈ విషయాన్ని బుధవారం మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విధి నిర్వహణలో తపాలా ఉద్యోగి మృతి

ఆకివీడు, జూన్ 19: విధి నిర్వహణలో వున్న తపాలాఉద్యోగి మరణించాడు. కోళ్ళపర్రు పోస్టాఫీసులో పనిచేస్తున్న తపాలా ఉద్యోగి ఎం.నూకన్న దొర(51) బుధవారం విధులు నిర్వర్తిస్తుండగా రక్తం కక్కుకుని చనిపోయాడు. ఆయనది రంపచోడవరం స్వగ్రామం కాగా సుమారు ఇరవై ఎనిమిదేళ్ల నుంచి కోళ్ళపర్రులోనే ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇటీవల ఆయన అనారోగ్యం బారిన పడ్డారని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని సహోద్యోగులు చెబుతున్నారు. పోస్టాఫీసు సిబ్బంది నివాళులర్పించి సంతాపం తెలిపారు

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని పరిశీలిస్తున్న సిద్ధాంతం గ్రామస్థులు

పెనుగొండ, జూన్ 19 : సిద్ధాంతం వశిష్ట గోదావరి తీరాన కేదారేశ్వర స్వామి ఆలయం వద్ద గత నాలుగు నెలలుగా సుమారు 50 ఏళ్ల వయస్సున్న ఓ మహిళ ఉంటుందని స్థానికులు తెలిపారు. ఆ మహిళకు పక్షవాతం ఉండడంతో మాటలు సరిగ్గా చెప్పలేకపోవడంతో ఆమె వివరాలు స్థానిక అధికారులు సేకరించలేకపోయారు. బుధవారం తెల్లవారుజామున ఆమె మరణించడంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సర్పంచ్ చింతపల్లి గనిరాజు ఘటన స్థలానికి తన సిబ్బందితో వెళ్లి పరిశీలించి కొంతమంది వార్డు సభ్యులతో కలిసి అనాథ శవానికి అంతిమ సంస్కారాలు పూర్తి చేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నక్కా సత్యనారాయణ, అంజూరి శ్రీను, ఆకుల వీర్రాజు, తదితరులు ఉన్నారు.

నామాల వాడా నిన్నొదలా..



రాజీనామా ఊసెత్తని నామినేటెడ్ సభ్యులు

» ఆలయ చైర్మన్, ఎక్స్‌అఫీషియోలకు మినహాయింపు

ద్వారకాతిరుమల, జూన్ 19: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 16 మంది ధర్మకర్తలతో కొలువుతీరిన ట్రస్టు బోర్డులో 14 మంది సభ్యులు ఆ నామాలవాడిని వదలలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు పొందిన వీరు.. ప్రభుత్వం మారినా వైదొలగడం లేదు. వైసీపీ హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన పలువురు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు. వైసీపీ హయాంలో శ్రీవారి దేవస్థానానికి రెండుసార్లు పాలకమండలి నియామకాలు జరిగాయి. 14 మంది సభ్యులతో 2011లో తొలిసారిగా ఏర్పాటైన ట్రస్టుబోర్డు 2013 వరకు కొనసాగింది. ఆ తరువాత చట్టపరిధిలోని అంశాలకు లోబడి అప్పడి ప్రభుత్వం ఐదేళ్లపాటు ట్రస్టుబోర్డు నియామకం జరుగకుండా మినహాయింపునిచ్చింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొదటిసారి 2020 ఫిబ్రవరి 20న శ్రీవారి దేవస్థానానికి ట్రస్టుబోర్డును నియమిస్తూ అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి రెండేళ్లపాటు వారు విధులు నిర్వర్తించారు. తర్వాత నియామకాలు జరుగకపోవడంతో ఆ బోర్డు పదవీకాలాన్ని పొడిగించారు. ప్రస్తుతం ఉన్న పాలక మండలి 2023 ఫిబ్రవరి 9న పాలకమండలి చైర్మన్‌గా అనువంశిక ధర్మకర్త రాజా ఎస్వీ సుధాకరరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడైన ఆలయ ప్రధాన అర్చకులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాథాచార్యులుతో కలసి మొత్తం 16 మంది పదవీ ప్రమాణస్వీకారం చేశారు. వీరికి 2025 ఫిబ్రవరి 8 వరకు గడువు ఉంది.

ఆధ్యాత్మికతను మరచిన కొందరు వైసీపీ నేతలు..

దేవదాయ చట్టం సెక్షన్ 18 ప్రకారం దేవాలయానికి ఒక వ్యక్తి ట్రస్ట్ బోర్డు సభ్యునిగా నియమితులయ్యేందుకు గాను అతడికి దేవుని పట్ల విశ్వాసం, నమ్మకముండాలి. సదరు వ్యక్తికి మంచినడవడిక, కీర్తి కల్గి ఉండాలి. దేవాలయాలను అభివృద్ధి చేయగలవాడై ఉండాలి. దేవాలయాల వ్యవహారాలను చూసే సమయం కలిగి ఉండాలి. అతడిపై క్రిమినల్ కేసులుండకూడదు. అయితే ఎంతో పవిత్రమైన ఈ దేవాలయ ప్రాంగణంలో చెప్పులు వేసుకుని తిరిగిన చరిత్ర 2020లో వేసిన ట్రస్టు బోర్డులోని ఓ సభ్యునిది. తమకు, లేదా తాము చెప్పిన వారికి దర్శనం చేయించలేదనే కారణంతో తాము రాజీనామా చేస్తామని బెదిరింపులు.. ఆలయ అధికారులకు డ్యూటీలు మార్పించిన ఘనత ఇప్పటి కొందరు పాలకమండలి సభ్యులది. శేషాచలంపైనే పార్టీలో జాయినింగ్‌లు, తాము ద్వారకాతిరుమలకు వచ్చామని తెలిసినా.. మండపానికి వచ్చేవరకూ వేచిచూడకుండా శ్రీవారి కల్యాణతంతును జరిపేయడం ఏమిటని మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అప్పట్లో చిందులు తొక్కారు. ట్రస్టీలు, అధికారులు, అర్చకులతో క్షమాపణ చెప్పించుకుని మరీ వారు కల్యాణానికి హాజరైన వైనాన్ని ఇక్కడి వారు ఇంకా మర్చిపోలేదు. శేషాచలంపై పార్టీ జెండాలతో తిరగడమే కాకుండా ఏకంగా నాన్‌వెజ్ భోజనాలు పెట్టేశారు. ఇలా గత ప్రభుత్వ హయాంలో ఆలయం అంటే ఆధ్యాత్మికత అని మర్చిపోయారు. గత పాలకమండలిలో నియమితులైన ఓ వ్యక్తి ఇది తన హోదాకు తగినది కాదని రాజీనామా చేశారు. అతని స్థానంలో మరొకరిని నియమించారు. ఇటువంటివి ఎన్నో వైసీపీ హయాంలో జరిగాయి. ఇప్పటికైనా నూతన కూటమి ప్రభుత్వం వీటిని పరిగణనలోకి తీసుకుని ఆలయ మర్యాదలను కాపాడుతూ భక్తి భావం, దైవచింతన కల్గిన వారినే పాలకమండలి సభ్యులుగా కొత్తగా ఎంపిక చేయాలని పలువురు కోరుతున్నారు.

రాజీనామా చేయాల్సిందేనా !

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక కొత్తప్రభుత్వం కొలువు తీరకముందే సీఎం కార్యాలయం నుంచి నామినేటెడ్ పోస్టులను రద్దు చేస్తున్నట్టు ఉత్తర్వులు వచ్చాయి. అవి ఇంకా సంబంధిత కార్యాలయాలకు చేరలేదని సమాచారం. ప్రభుత్వం మారినందున వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పోస్టులు పొందిన వారంతా ఉత్తర్వులు వెలుబడిన వెంటనే రాజీనామా చేయాల్సిందే. చైర్మన్‌గా వ్యవహరిస్తున్న అనువంశిక ధర్మకర్తకు, ఎక్స్‌అఫీషియో సభ్యునికి రాజీనామా చేయాల్సిన అవసరం వర్తించదు. కూటమి ప్రభుత్వ కూర్పుతో నూతన పాలకమండలిలో చోటు కోసం ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభమ య్యాయి. ప్రభుత్వం మారింది కనుక ప్రస్తుత పాలకమండలి సభ్యులు స్వచ్ఛందంగా తప్పుకుంటారా.. లేక ఉత్తర్వులు వెలుబడాల్సిందేనా అనేది వేచి చూడాలి.

ప్రజాచైతన్యంతోనే కూటమి అఖండ విజయం

» రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మంత్రి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జూన్ 19 : 'ప్రజా చైతన్యంతోనే కూటమి అఖండ విజయం సాధించింది. ప్రజా తీర్పుగా భావిస్తున్నాం.. పేదల సంక్షేమం, విద్య వ్యవసాయ, పరిశ్రమ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాం. రాష్ట్ర ప్రజలు కోరుకున్న మార్పుకు అనుగుణంగా నిజాయతీగా చట్టప్రకారం కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతాం.. గాడి తప్పిన వ్యవస్థలను సక్రమ విధానాల్లోకి సీఎం చంద్రబాబు నాయుడు తీసుకువస్తారు' అని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని సరిపిడకల రామారావు నివాసానికి బుధవారం విచ్చేసిన మంత్రి శ్రీనివాస్, లక్ష్మి సింధు దంపతులను పద్మావతి వేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ, హౌసింగ్ బోర్డు డెవలప్‌మెంట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సభకు మందిర అధ్యక్షుడు కంతేటీ వెంకటరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ యువతకే ప్రాధాన్యత ఇచ్చిన చంద్రబాబు అభినందనీయులని, రాష్ట్రాభివృద్ధికి అందరూ కలిసి పని చేద్దామన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, జనపాటి మధు, జి.మల్లేశ్వరరావు, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు సరిపిడకల రామారావు, ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి..

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం తల్లిదండ్రుల సామాజిక బాధ్యతగా బడిలో చేర్పించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వ బడికి పోదాం రా' .. కార్యక్రమ బ్రోచర్‌ను శ్రీ విజ్ఞానవేదిక, సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన బడికి పోదాంరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరంలో డ్రాపవుట్స్ బాలబాలికలను గుర్తించి బడిలో చేర్పించడం కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తామన్నారు. మంత్రి శ్రీనివాస్ స్ఫూర్తితో పీఎస్ఎం హైస్కూల్లో గీతా సహన్ అనే బాలికను ఎనిమిదో తరగతిలో చేర్పించి నోట్ పుస్తకాలను అందిం చామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వారణాసి రాధాకృష్ణ, రోటరీ క్లబ్ నాయకులు షేక్ బాబాజీ సాహెబ్, నరహరిశెట్టి కృష్ణ, ఎంఈవో జి.శ్రీనివాస్, ఎ.ప్రకాశ్, వడుపు గోపి తదితరులు పాల్గొన్నారు.

అపరాధ రుసుం లేకుండా అదనపు పొగాకు అమ్ముకుంటాం

» పొగాకు బోర్డు చైర్మన్‌కు రైతు సంఘం నాయకుల వినతి



పొగాకు బోర్డు చైర్మన్ శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం, జూన్ 19 : ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాల పరిధిలో అదనంగా పండించిన పొగాకును అపరాధ రుసుం లేకుండా వేలం కేంద్రాల్లో అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వాలని రైతు సంఘ నాయకులు, రైతులు కోరారు. బుధవారం బుధవారం గుంటూరులోని పొగాకు బోర్డు చైర్మన్ అద్దంకి శ్రీధర్‌బాబును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయంపై ఢిల్లీలోని వాణిజ్య శాఖకు సిఫారసు చేశానని చెప్పారని రైతు సంఘం నాయకుడు పరిమి రాంబాబు పేర్కొన్నారు. రైతుల సౌకర్యార్థం పట్టణంలోని రెండు వేలం కేంద్రాలకు ఒక కమ్యూనిటీ హాలు నిర్మించాలని చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. రైతు సంఘం నాయకులు, రైతులు వీవీఎస్ ప్రకాశరావు, కరాటం రెడ్డిబాబు, కూచిపూడి రమేష్, అట్లూరి సతీష్, గూడూరి నాగరాజు, కాకర్ల వివేకానంద, అడపా సత్యనారాయణ, ఇల్లూరి రాంబాబు, గద్దే శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

మొగల్తూరు, జూన్ 19: మొగల్తూరు పంచాయతీ పరిధి అగ్రహారంలో బుధవారం వేకువజామున పిడుగు పాటుకు కొబ్బరి చెట్టు ఆహుతి కాగా ఆ ప్రాంతంలోని నివాసాల్లో విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. అగ్రహారంలోని పోతురెడ్డి నాయుడు ఇంటి సమీపంలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడడంతో పెద్ద మంటలు, శబ్దాలు చెలరేగాయి. చెట్టు పూర్తిగా దగ్ధం కాగా ఆ ప్రాంతంలోని నాయుడు ఇంటితో పాటు పలువురి గృహాల్లో ఫ్యాన్‌లు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీ, ఇన్వర్టర్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనపై బాధితులు విద్యుత్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా సిబ్బంది దగ్ధమైన వాటిని పరిశీలించారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ

ఏలూరు క్రైం, జూన్ 19:రాత్రివేళ ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు తెంపుకు పారిపోయారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రులోని గీతా కాలనీలో నివాసం ఉంటున్న డి.రమాదేవి ఇంటి ఆరుబయట రాత్రివేళ నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని రెండు కాసుల బంగారు గొలుసును తెంపుకు పారిపోయారు. ఈ ఘటనపై ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు రూరల్ పోలీసులు తెలిపారు.

కొబ్బరికాయల చోరీ ముఠా అరెస్ట్

పాలకొల్లు రూరల్, జూన్ 19 : పాలకొల్లు రూరల్ మండలంలోని పలు కొబ్బరికాయల దుకాణాలలో కురిడీ కాయలను, నీటి పంపు మోటార్లను చోరీ చేసే తొమ్మిది మంది ముఠా సభ్యులను సోమవారం రాత్రి అరెస్టు చేశామని పాలకొల్లు రూరల్ ఎస్ఐ బి.హరికృష్ణ తెలిపారు. గస్తీలో భాగంగా దిగమర్రు బైపాస్‌రోడ్డులో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న ఈ తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద ఉన్న 14 నీటి పంపు మోటార్లను, రెండు వ్యాన్లను ఒక లక్షా పదకొండు వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం, జూన్ 19 : తన భర్త, అతడి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులు, చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని స్టేషన్ రైటర్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన వసంతాటి వెంకటేశ్వరరావుకు విజయశాంతికు 2005లో వివాహం జరిగిందని వీరికి ఒక కుమార్తె ఉందని తెలిపారు. గత కొంత కాలంగా వెంకటేశ్వరరావు తోపాటు అతడి కుటుంబసభ్యులు అధికకట్నం కోసం ఆమెను మానసి కంగా, శారీరకంగా వేధిస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఆమె భర్తతో పాటు అతడి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని స్టేషన్ రైటర్ తెలిపారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

» మరో యువకుడికి తీవ్ర గాయాలు.. పెంటపాడులో ఘటన



కిషోర్‌రెడ్డి(ఫైల్), గాయపడిన మణికంఠరెడ్డి

పెంటపాడు, జూన్ 19 : రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. తాళ్ళముదునూరుపాడుకు చెందిన పులగం కిషోర్‌రెడ్డి (21) తన స్నేహితుడు సత్తి మణికంఠరెడ్డితో పాటు మరో ఇద్దరు స్నేహి తులతో బుధవారం పెంటపాడులోని ఒక వివాహానికి హాజరయ్యేందుకు వచ్చాడు. అనంతరం మోటారుసైకిల్‌పై పెంటపాడు నుంచి తాళ్ళముదునూ రుపాడు వెళ్తుండంగా పెంటపాడు కాలేజ్ సెంటర్‌సమీపంలో తాడేపల్లి గూడెం నుంచి భీమవరం వైపునకు వెళ్తున్న కారును ఢీ కొట్టారు. తీవ్రగాయాలైన కిషోర్‌రెడ్డి, మణికంఠరెడ్డిలను స్థానికులు సత్వరమే ఆటోపై తాడేపల్లిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న కిషోర్‌రెడ్డి తలకు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెనుక కూర్చున్న మణికంఠరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో అతడికి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. సంఘటనా స్థలాన్ని పెంటపాడు ఎస్ఐ శీలం శంకర్ పరిశీలించారు. మృతుడి సోదరుడు నాగవంశీరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతి చెందిన కిషోర్‌రెడ్డి పెంటపాడు డీఆర్‌జీ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశాడని బంధువులు తెలిపారు. తల్లిదండ్రులకు ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు హఠాత్తుగా మృత్యువాత పడడంతో కన్నీరుమున్నీరయ్యారు. యువకుని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

యలమంచిలి, జూన్ 19 : రోడ్డు ప్రమాదానికి గురైన పాలకొల్లు పట్టణానికి చెందిన బెజవాడ నాగేశ్వరరావు(66) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. కొన్నేళ్లుగా పట్టణంలో నివాసం ఉంటున్న ఆయన వ్యవసాయ పనుల నిమిత్తం ఈనెల 17న స్వగ్రామమైన కాంభోట్లపాలెం బైక్‌పై వెళ్తుండగా కట్టుపాలెం ప్రధాన కూడలి వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఏలూరులోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ముఠా కూలీ మృతి

ఏలూరు క్రైం, జూన్ 19 : ఊకలారీ లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఏలూరులోని తిలక్‌నగర్‌కు చెందిన గులిపల్లి కోటేశ్వరరావు (42) ముఠా కూలీగా పనిచేస్తున్నాడు. ఈనెల 16వ తేదీ రాత్రి సత్రంపాడులో ఊకలారీ లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు లారీపైనుంచి జారిపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. అతడిని గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు త్రీటౌన్ పోలీసులకు అందగా ఘటనా స్థలాన్ని పరిశీలించి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్రంపాడులో చోరీ

ఏలూరు క్రైం, జూన్ 19 : అపార్టుమెంటులో ఫ్లాట్‌కు తాళం వేసి స్కూలులో ఉన్న పాపను తీసుకువచ్చేలోపు 20 నిమిషాల వ్యవధిలోనే దొంగ ఆ ఇంటి తాళాలు పగులగొట్టి రూ.లక్ష నగదు, బంగారు గొలుసు అపహరించుకుపోయాడు. ఏలూరు సత్రంపాడులోని ఏటీసీ అపార్టుమెంటులో పొల్నూరి సాయిప్రసన్న నివాసం ఉంటున్నారు. ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్నారు. ఈనెల 18 తేదీ సాయంత్రం 3.30 గంటలకు స్కూలుకు వెళ్లి పాపను తీసుకుని 3.50 నిమిషాలకు ఇంటికి వచ్చేశారు. ఈలోపు ఫ్లాట్ తలుపులు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని లక్ష రూపాయల నగదు, మూడు కాసుల బంగారు చైన్ గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరు కాల్వలో లారీ క్లీనర్ గల్లంతు

» కొనసాగిన గాలింపు చర్యలు.. కానరాని ఆచూకీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 19:తాడేపల్లిగూడెం పట్టణంలోని ఏలూరు కాల్వలో ఓ వ్యక్తి మద్యం మత్తులో ప్రమాదవశాత్తు పడి గల్లంతైన ఘటన బుధవారం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి.. పట్టణంలోని గొల్లగూడెంకు చెందిన వి.భైరవస్వామి (42) లారీ క్లీనర్ పనిచేస్తుంటాడు. అతడు మద్యానికి బానిసై మత్తులో ఊగుతూ బుధవారం సాయంత్రం ఏలూరు కాల్వ వంతెన నుంచి కాల్వలోకి పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాల్వలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. రాత్రి చీకటి పడడంతో గాలింపు చర్యలు ఆపి ఉదయాన్నే గాలించనున్నారు. ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయినట్టు అనుమానిస్తున్నామని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ఏలూరు క్రైం/ఉంగుటూరు, జూన్ 19 : ఇనిస్టాగ్రామ్‌లో పదహారేళ్ల యువతిని పరిచయం చేసుకుని మాయమాటలు చెప్పి తన గ్రామానికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన యువతి ఇనిస్టాగ్రామ్ చూస్తుండగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన వరికూటి మధు(21) పరిచయం అయ్యాడు. ఆమెకు మాయమాటలు చెప్పి ఈనెల 18వ తేదీన ఏలూరు కొత్త బస్టాండ్ నుంచి తన గ్రామానికి తీసుకువెళ్ళి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం వరికూటి మధుపై కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం, జూన్ 19 : బాలిక అదృశ్యం.. లైంగిక దాడి ఘటనలో ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ జ్యోతిబస్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. మండలంలోని ఓ గ్రామంలో ఐదో తరగతి వరకు చదివిన బాలిక గత నెల 26వ తేదీన తన తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి తండ్రి లేచి చూసే సరికి బాలిక కనిపించకపోవడంతో చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పి. రాజేష్ తెలిపారు. జీలుగుమిల్లి మండలం టేకూరు గ్రామానికి చెందిన నేరం సందీప్ అలియాస్ గొల్ల సందీప్ బాలికను కిడ్నాప్ చేయడంతో పాటు టేకూరు ఆర్అండ్ఆర్ కాలనీలో ఖాళీగా ఉన్న ఓ ఇంట్లో బాలికను దాచి ఉంచాడన్నారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపారు. బాలిక ఆచూకీ లభించడంతో బుధవారం నిందితుడు సందీప్‌ను అరెస్ట్ చేసి అతడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

భారీ వర్షం

» గాలులకు రోడ్లపై పడిపోయిన చెట్లకొమ్మలు

» అత్యధికంగా పెనుమంత్రలో 60.2 మిల్లీమీటర్లు

» అత్యల్పంగా తాడేపల్లిగూడెం, పెంటపాడుల్లో 1.2 వర్షపాతం

» పిడుగులు, ఉరుములకు భయపడిన ప్రజలు





భీమవరంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు.. భీమవరంలో పంపుల చెరువుకు వెళ్లే మార్గంలో నీరు

భీమవరం టౌన్/పోలవరం, జూన్ 19 : నాలుగు రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన ఉమ్మడి పశ్చిమ గోదావరి ప్రజలకు బుధవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా వాతావరణం మారి పిడుగులతో పాటు భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. తెల్లవారుజామున చిన్న, చిన్న చినుకులతో ప్రారంభమైన వాన గాలులు, ఉరుములు, పిడుగులతో ఒక్కసారిగా దద్దరిల్లిపోయింది. దాదాపు గంటన్నరపాటు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. గాలులకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అంధకారంలోనే ప్రజలు బిక్కుబిక్కుమంటు గడిపారు. గాలులకు రోడ్లపై చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. డ్రెయిన్లు పొంగిపోర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. తెల్లవారిన తరువాత వర్షం లేకపోవడంతో డ్రెయిన్లు లాగేయడంతో నీటి నిల్వలు అంతగా కనిపించలేదు. భారీ వర్షం కారణంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంత్రలో 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదైంది. తాడేపల్లిగూడెం, పెంటపాడులలో 1.2 మిల్లీమీటర్ల అత్యల్ప వర్షంపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో వర్షపాత నమోదు వివరాలివి.. పెనుగొండలో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం, ఆచంట-10, పోడూరు-20.6, మొగల్తూరు-3.6, నరసాపురం-4, యలమంచిలి-8.2, గణపవరం-2.4, ఆకివీడు-19.8, ఉండి-4.2, పాలకోడేరు-40.4, వీరవాసరం-47.2, భీమవరం-48.8, కాళ్ళ-7.2, తణుకు-6.2, అత్తిలి-16.4, ఇరగవరం-14.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పోలవరంలో జోరువాన..

పోలవరం మండలంలో బుధవారం ఉదయం జోరు వాన కురిసింది. పోలవరం మెయిన్‌రోడ్డులో వర్షపునీరు నిలిచి ప్రజానీకం పలు అవస్థలకు గురయ్యారు. పట్టిసీమ వీరభద్రపురంలో పలుచోట్ల డ్రెయినేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉండడంతో వీధుల్లో రోడ్లపై, నివాసాల చుట్టూ నీరు, మురికి నిలిచి ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు.

మంత్రి సుభాష్‌ను సత్కరించిన గన్ని


మంత్రి సుభాష్‌ను సత్కరించిన గన్ని

భీమడోలు, జూన్ 19: పూళ్ళ గ్రామంలో స్నేహితుడిని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం పరామర్శించారు. పూళ్ళ మాజీ సర్పంచ్ భర్త నేచర్ల శ్రీనివాసరావు ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. శ్రీను ఆరోగ్య వివరాలు మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సుభాష్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు శాలువాకప్పి సత్కరించారు. టీడీపీ నేతలు పుల్లయ్యనాయుడు, పుప్పాల హరీష్, శిరిబత్తిన కొండబాబు, రాజీలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి టీజీ భరత్‌ను కలసిన ఆర్యవైశ్య నాయకులు


మంత్రి భరత్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, జూన్ 19 మంత్రి టీజీ.భరత్‌ను ఏలూరు అర్బన్‌జిల్లా ఆర్యవైశ్యసంఘం నాయకులు బుధవారం విజయవాడలో కలుసుకుని పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రి పదవిని చేపట్టడంపై గౌరవాధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు, అధ్యక్షుడు జయప్రకాష్, మద్దుల రవికుమార్, వేమా సురేష్, బచ్చు విష్ణు తదితరులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. మంత్రి భరత్‌కు శాలువాకప్పి సత్కరించారు.

హోంమంత్రిని అభినందించిన టీడీపీ నేతలు


హోం మంత్రి అనితకు పుష్పగుచ్ఛం ఇచ్చిన నేతలు

కామవరపుకోట, జూన్ 19 : హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వంగలపూడి అనితను మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, బేతిన వెంకట్రావు, తదితరులు రాజధానిలో కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఐదేళ్లుగా అదుపుతప్పిన శాంతి భద్రతలను కాపాడాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

ఎమ్మెల్యే దృష్టికి ఆశా వర్కర్ల సమస్యలు


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న ఆశావర్కర్లు

ఏలూరు రూరల్, జూన్ 19: ఎమ్మెల్యే బడేటి చంటిని బుధవారం కలసిన ఆశావర్కర్లు సమస్యలు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఇబ్బందులను ఏకరువు పెట్టారు. చంటి మాట్లాడుతూ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు పాస్టర్ల శుభాకాంక్షలు

పోలవరం, జూన్ 19: ఎమ్మెల్యే చిర్రి బాలరాజును బుధవారం పాస్టర్లు కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి సన్మానం చేశారు. బి జయరాజు, ఇమ్మానుయేలు క్రిష్టాఫర్, రొక్కల మేషెక్ బాబు, టిఎం శాస్త్రి, ఇ సంపతరావు, సామ్యూల్, రాజు ప్రకాశ్, డేవిడ్, సువర్ణరాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

బొకే వద్దు.. మొక్కలు ముద్దు

పెదవేగి, జూన్ 19: దుగ్గిరాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చింతమనేనిని కలసి, పూలమొక్కలు, బొకేలు ఇచ్చి అభినందించారు. ప్రభాకర్ మాట్లాడుతూ మొక్కల నాటి, చెట్లను పెంచితే పర్యావరణం సాధ్యపడుతుందన్నారు. బొకేలు అలంకారప్రాయమేనని, మొక్క ఇస్తే పర్యావరణం కాపాడడానికి వీలవుతుందని ఆయన చెప్పారు. తన దగ్గరకు వచ్చేవారు బొకేలు కాకుండా పండ్లమొక్కలను తీసుకురావాలని సూచించారు. తనకు అందించిన మొక్కలను బహిరంగ ప్రదేశాలు, రహదారుల పక్కన నాటించి, పరిరక్షించే ఏర్పాటు చేస్తానని ప్రభాకర్ తెలిపారు. చలమలశెట్టి రమేష్ బాబు, తాతా సత్యనారాయణ, బొప్పన సుధాకర్, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, మేరుగు నాగరాజు, పామర్తి గంగరాజు పాల్గొన్నారు.

పవన్ బాధ్యతల స్వీకారంతో నాయకుల సంబరాలు


జనసేన, టీడీపీ, బీజేపీ నాయకుల సందడి

కొయ్యలగూడెం, జూన్ 19: పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కొయ్యలగూడెం సెంటర్‌లో బుధవారం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. ఆయన కేటాయించిన శాఖ ద్వారా రాష్ట్రంలో అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. తోట రవి, చేడిపిండి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు జ్యేష్ట రామకృష్ణ, బీజేపీ నాయకులు బొమ్మా బాబు, సతీష్, మధు, శ్రీను, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న టీడీపీ నాయకులు


కొబ్బరికాయలు కొడుతున్న నేతలు

కొయ్యలగూడెం, జూన్ 19: టీడీపీ కూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో పలువురు నేతలు బుధవారం మొక్కు చెల్లించుకున్నారు. ప్రధాన సెంటర్‌లోని గణపతి ఆలయం వద్ద పట్టణ మహిళా అధ్యక్షురాలు దుర్గాదేవి 151 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత అప్పలనాయుడుకు ఆత్మీయ సత్కారం


అప్పలనాయుడికి సత్కారం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 19: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించడంతో జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడికి బుధవారం మాల మహానాడు నాయకులు, మునిసిపల్ కార్మికులు ఆత్మీయ సత్కారం చేశారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అబ్బూరి అనీల్‌బాబు మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని కూటమికి అఖండ విజయం చేకూర్చారని, ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా ప్రభుత్వం పయనించాలన్నారు. పద్మారావు, శంకర్, దుర్గారావు, మునిసిపల్ కార్మిక సంఘ నాయకులు రాజు, సుగుణరావు తదితరులు ఉన్నారు.

పెదవాగు కుడి, ఎడమ కాలువలను బాగుచేయండి


ఏపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బుట్టాయగూడెం, జూన్ 19: వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని పెదవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు తక్షణమే మరమ్మతులు చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరారు. ఐటీడీఏలో బుధవారం జరిగిన గిరిజన దర్బార్‌లో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్-ప్రజాపంథా ఆధ్వర్యంలో ఏపీవో వీవీఎస్.నాయుడికి వినతిపత్రం అందజేశారు. ప్రజాపంథా నాయకుడు ఎస్‌కె గౌస్ మాట్లాడుతూ పలుమార్లు ఆందోళన చేపట్టడంతో 2023 జూన్‌లో రూ.94 లక్షల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. అనుమతులు మంజూరుచేసి పనులు ప్రారంభించాలని కోరారు. జి.ముత్యాలరావు, సోయం చంద్రరావు, డి.ఉంగయ్య, పి.మాసయ్య, ఎం.భద్రయ్య పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో శాంతి కమిటీలు : డీఎస్పీ

టి.నరసాపురం, జూన్ 19: గ్రామస్థాయి శాంతి కమిటీలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామపెద్దలు, అన్నిపార్టీల నాయకులతో కలిసి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్‌ఐడి దుర్గామహేశ్వరరావు పాల్గొన్నారు.


ఏలూరు వైఎస్‌ఆర్ నగర్‌లో ఉపాధ్యాయుల ర్యాలీ


చింతలపూడిలో విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ


దెందులూరులో విద్యార్థికి ప్రవేశం కల్పిస్తున్న అధికారులు


భీమడోలులో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బడికిపోతా

ఉపాధ్యాయుల అవగాహనా కార్యక్రమాలు

ఏలూరు రూరల్, జూన్ 19: పిల్లలను బడిలో చేర్పించడంపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలం వైఎస్‌ఆర్ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో విద్యా సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-2 ఆర్.రంగయ్య మాట్లాడుతూ బడికి పోతా కార్యక్రమం ఆవశ్యకత అందరు తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా పిల్లల తల్లిదండ్రులను కలసి విద్య గొప్పదనాన్ని వివరిస్తే తప్పని సరిగా ప్రతిపిల్లవాడికి నేను బడికిపోతా అనే ఆలోచన వస్తుందని తెలిపారు. బడిబయట ఉన్న 14ఏళ్లలోపు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: పట్టణంలోని పాత చింతలపూడిలో నేను బడికిపోతా కార్యక్రమంలో భాగం ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం హేమలత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పక్కాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి గ్రామస్తులు చొరవ తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపడంలో శ్రద్ధచూపి వారి భవిష్యత్‌ను, హక్కును కాపాడాలన్నారు. అనంతరం జడ్పీ బాలికల హైస్కూల్‌లో 200 మంది విద్యార్థినులకు బ్యాగ్‌లు, పుస్తకాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనిష్‌కుమార్, కొత్తపూడి శేషగిరి, చిట్లూరి ధర్మరాజు, చీదరాల మధుబాబు, టి.వెంకటనారాయణ, బి.నాగభూషణం, టి.అప్పారావు, హెచ్‌ఎం చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించి నేను బడికిపోతా కార్యక్రమ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో స్వర్ణలత సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో భీమడోలు హైస్కూలులో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో స్వర్ణలత మాట్లాడుతూ గ్రామాల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీలు నిర్వహించాలని, బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలందరిని కళాశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

● దెందులూరు: మండలంలో బడి బయట పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పేవిధంగా అందరూ సహకరించాలని ఎంపీడీవో విశ్రీలత అన్నారు. ఎంఈవోలు అన్నమ్మ, ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పిల్లలందరినీ పాఠశాలలో చేర్పడానికి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 29న దెందులూరు హైస్కూల్‌లో దివ్యాంగుల వైద్య శిబిరం జరుగుతుందన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న పీవో సూర్యతేజ

బుట్టాయగూడెం, జూన్ 19: బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం సికిల్ సెల్ ఎనీమియాపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని వైద్యాధికారులకు సూచించారు. అవగాహన కల్పించడంతోపాటు నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. డీఎంవో జె.సురేష్‌కుమార్, డీవైఈవో కె.నీలయ్య, ఎఎంవో కె.శిరమయ్య, ఏటీడబ్ల్యువో శ్రీవిద్య పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఎంతో మేలు


అన్నప్రాసన నిర్వహిస్తున్న సీడీపీవో

లింగపాలెం, జూన్ 19: గర్భిణులకు పౌష్టికాహారం ఎంతో మేలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని చింతలపూడి ప్రాజెక్టు సీడీపీవో మాధవి అన్నారు. ముడిచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మాధవి, సూపర్‌వైజర్ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కల్పన, మనీషా దేవి, బీజేఎన్ కుమారి, ఎలిజబెత్ రాణి, రమాదేవి, ఆయాలు పాల్గొన్నారు.

● పోలవరం: పాత పట్టిసీమలో బుధవారం అంగన్వాడీల నుంచి ప్రాథమిక విద్యకు అర్హులైన 15 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐదేళ్లు నిండి అంగన్వాడీల నుంచి ఉన్నత విద్యకోసం వెళుతున్న బాలలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి వీడ్కోలు పలికారు. పట్టిసీమ 1, 2 ,3, 4 అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సూపర్‌వైజర్ జి.రాణి తెలిపారు. హెచ్‌ఎం రత్నాజీ, అంగన్వాడీల కార్యకర్తలు, ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ


సింగగూడెంలో పుస్తకాల పంపిణీ

లింగపాలెం, జూన్ 19: విద్యతోనే సమాజంలో గౌరవమని మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరావు అన్నారు. సింగగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పుస్తకాలు పంపిణీ చేశారు. సమాజంలో గౌరవంగా జీవించాలన్నా, ఉన్నతస్థాయికి ఎదగాలన్నా విద్యతోనే సాధ్యమని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కావాల్సిన వస్తువులు అన్ని అందిస్తుందని, విద్యార్థులు చదువుకునేందుకు కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తుందని తెలిపారు. బొంతు రాంబాబు, తగరం హేమలత, హెచ్‌ఎం బి.శ్రీధర్, వైస్ ప్రసిడెంట్ బొంతు శ్రీను, పామర్తి వెంకటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణపురం హైస్కూల్‌లో..


నారాయణపురంలో కిట్ల పంపిణీ

ఉంగుటూరు, జూన్ 19: నారాయణపురం హైస్కూల్, తల్లాపురం పాఠశాలల్లో బుధవారం విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు కిట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం షేక్ నాగూర్ సాహెబ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దిడ్ల అలకనంద, శ్రీనివాస్ ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు, పొన్నాడ రవి, తల్లాపురం పాఠశాలలో సర్పంచ్ పసుపులేటి నరసింహరావు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు.

తలసేమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి


రక్త మార్పిడి చేస్తున్న రెడ్‌క్రాస్ వైద్యులు

ఏలూరు క్రైం, జూన్ 19: సికిల్‌సెల్ జన్యుపరమైన, రక్త సంబంధిత వ్యాధి అని, ప్రజలు పిల్లల ఆరోగ్యంపై అవగాహనతో ఉండాలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలోరి రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 11 మంది తలసేమియా, సికిల్‌సెల్ చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. పరిమి భాగ్యలక్ష్మి, దేవినేని భాస్కరరావు, కేబీ.సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, కడియాల కృష్ణారావు, పరిమి భాగ్యలక్ష్మి, కేవీ.రమణ, డి.భాస్కరరావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం ఇస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

మద్యం దుకాణ సిబ్బందిని ఆదుకోవాలి

జీలుగుమిల్లి, జూన్ 19: గత ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్, సెల్స్‌మన్‌గా పనిచేసిన ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఎమ్మెల్యేను ఆశ్రయించారు. గిరిజన మండలాల్లో మద్యం దుకాణాల్లో పని చేసిన సిబ్బంది బుధవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు ఎత్తివేసి, టెండర్ల ద్వారా దుకాణాల ఏర్పాటుతో తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం కొయ్యలగూడెం మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

జంగారెడ్డిగూడెం, జూన్ 19: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రభుత్వాసుపత్రి వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి అబ్రహం ఆధ్వర్యంలో జరిగిన కార్యకమంలో ఆర్ఎంవో డాక్టర్ వి.రాంబాబు, అగ్నిమాపక సిబ్బంది ఎం.శ్రీనివాస్, ఎన్.సత్యనారాయణ, డి.బాలాజీ, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల నిలిపివేత.. కూలీలకు ఇబ్బందులు

ఏలూరు కలెక్టరేట్, జూన్ 19: దెందులూరు, పెదవేగి మండలంలో ఉపాధి హామీ పనులు నిలిపివేయడంతో కూలీలు అవస్థలు పడుతున్నారని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా డ్వామా అధికారులపై మండిపడ్డారు. డ్వామా కార్యాలయంలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధికూలీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లటానికి వెళితే కనీసం పట్టించుకోలేదని, సమస్య పరిష్కారం చేసే అధికారులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క ఉపాధి హామీ కార్యాలయాలు అవినీతి, అక్రమాలకు నిలయంగా మారాయన్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఉపాధిహామీ పనులు జరుగుతుంటే దెందులూరు, పెదవేగి మండలంలో ఉపాధి పనులు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు వారి సమస్యలను అధికారులకు విన్నవించుకోవడం కోసం వస్తే కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. చట్టవ్యతిరేఖంగా డబ్బులు స్వాహా చేసుకుంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం కార్మికులపై రాజకీయ వేధింపులు

పెదవేగి, జూన్ 19: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారుచేసే కార్మికులపై రాజకీయ వేధింపులతో ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈవోకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం మారిన తరువాత మధ్యాహ్న భోజనం కార్మికులను తొలగించాలని చూస్తున్నారని, ఇది తగదన్నారు. మధ్యాహ్న భోజనం తయారుచేసే కార్మికులను 24ఏళ్లుగా అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కార్మికులకు వేధింపులు తప్పడంలేదని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ఐదేళ్ళకోసారి కార్మికులను మార్చడానికి చూస్తే ఇక కార్మికులకు భద్రత ఎక్కడ ఉంటుందని ఆమె ప్రశ్నించారు. ఇలాంటి వేధింపుల నుంచి కార్మికులకు రక్షణ కల్పించాలని, పని భద్రత కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎంఈవో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

మర్రిగూడెం భూవివాదాన్ని పరిష్కరించాలి

బుట్టాయగూడెం, జూన్ 19: మర్రిగూడెంలో గిరిజన, గిరిజనేతరుల మధ్య భూసమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయం వద్ద బుధవారం గిరిజనులు ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. భూమిలో పంటను గిరిజనేతరులు పట్టుకువెళుతుండగా తాము అడ్డుకున్నామని గిరిజనులు తెలిపారు. భూమికి విషయం కోర్టులో పెండింగ్‌లో ఉందని తెలిపారు. భూవివాదాన్ని పరిష్కరించి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.బాల సుందరం, కె.సుందరావు, పి.పార్వతి, గిరిజనులు పాల్గొన్నారు.


హనుమాన్ శోభాయాత్ర ప్రారంభిస్తున్న తపనా చౌదరి

శివాజీ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 19: ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) పిలుపునిచ్చారు. శివాజీ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా మద్దిఆంజనేయస్వామి ఆలయం నుంచి హనుమాన్ శోభాయాత్రను బుధవారం ప్రారంభించారు. గురవాయిగూడెం నుంచి ర్యాలీ జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ముగిసింది. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓలేటి సత్యనారాయణ, మద్ది క్షేత్రం ఈవో ఆకుల కొండలరావు, వెంకటస్వామి, బీజేపీ దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని క్షేత్రస్థాయి విద్యాధికారులను సమగ్రశిక్ష ఉన్నతాధికారులు ఆదేశించారు. వివిధ విద్యా కార్యక్రమాలపై ఆర్జేడీలు, డీఈవోలు, ఎస్ఎస్ఏ ఏపీసీలు, సెక్టోరల్ అధికారులతో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పలు సూచనలు చేశారు. యోగసనాలు, యోగా సంబంధిత కార్యకలాపాల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. వ్యాయామోపాధ్యాయులున్న ప్రతీ హైస్కూలులో యోగా దినోత్సవాన్ని నిర్వహించి, ఫోటోలు ఇతర వివరాలను గూగుల్ ట్రాకర్‌లో అప్‌లోడ్‌చేయాలని కోరారు. జిల్లాలోని మూడు కేజీబీవీల్లో ఇంటర్‌లో ప్రవేశాలు తక్కువగా ఉండడంపై రాష్ట్ర డైరెక్టర్ మధుసూదనరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో ప్రవేశాలకు వారంరోజుల గడువు ఇస్తున్నామని, తర్వాత మరోసారి సమీక్షించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల వివరాలను వెంటనే 'విద్యాంజలి' పోర్టల్‌లో నమోదు చేయాలని, స్థానికంగా దాతలు, స్వచ్ఛంద సేవాసంస్థల సేవలను వినియోగించుకోవాలని ఆదేశించారు.

22న నారాయణపురం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా


జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన ప్రిన్సిపాల్

ఉంగుటూరు, జూన్ 19: తాడేపల్లిగూడెం డీఆర్.గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఏపీ కాలేజి యూత్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నోడల్ రిసోర్స్ సెంటర్ ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ టి.కే.విశ్వేశ్వరరావు బుధవారం తెలిపారు. జాబ్‌మేళాలో దేశంలోని ప్రతిష్టాత్మకమైన కంపెనీలు ఉద్యోగార్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. పేటీఎం, అపోలో టైర్స్, అపెక్స్ ఫైనాన్సియల్ సర్వీసు, రెడ్డి అండ్ రెడ్డి మోటార్స్, ఆపిల్ ఐఫోన్ మ్యాన్యుఫ్యాక్చర్స్, తదితర కంపెనీల హెచ్‌ఆర్ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు నిరుద్యోగులు 9951405034, 9491175498, 85000 67765 నెంబర్లు లేదా జిల్లా ఉపాధి అధికారి 8886882032 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చింతలపూడిని అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే రోషన్

లింగపాలెం, జూన్ 19: చింతలపూడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, ఆరు నెలల్లోనే నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి చూపిస్తానని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. అన్నపనేనివారిగూడెంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి లేదన్నారు. చింతలపూడి ఎత్తిపోతల ద్వారా మెట్టప్రాంతాలకు నీరు అందేలా చూస్తామని, నియోజకవర్గంలో సాగునీరు, తాగునీటి సమస్య లేకుండా చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని, తన కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను తెలపాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలకు జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సిద్ధు పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరలో ఎస్సీవర్గీకరణ చేపట్టాలని ఆయన కోరారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** కుండీ సెంటర్‌లో జై గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. తొలుత విఘ్నేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి నివేదనలు సమర్పించారు. గరికతో అర్చనలు జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. గంపా చిన్న, మిత్రబృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.
- **కామవరపుకోట :** స్థానిక గుర్రాలచెరువు గట్టు వద్ద వరసిద్ధి వినాయకుడిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామివారికి ఆవుపాలతో అభిషేకం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. గరికతో అర్చన నిర్వహించి బెల్లం నివేదనలు సమర్పించారు. ఆలయ అర్చకులు సుదర్శనం సత్యశ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.
- కామవరపుకోట పంచాయతీలోని కొండగూడెం, గొల్లగూడెంకు చెందిన చింతపల్లి సత్యనారాయణ కుటుంబానికి టీడీపీ నాయకులు కోనేరు వెంకట సుబ్బారావు, ఘంటా సుధీర్‌బాబు, నెక్కలపు సూర్యనారాయణ, పండు జగదీష్, బొబ్బిలి డాన్ దివాకర్ తదితరులు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈదురుగాలులకు సత్యనారాయణ ఇంటిపై తాటిచెట్టు పడడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారి గాయపడడంతో సాయమందించారు. మనెల్లి కాంతారావు, మధు, వీఆర్వో కంకిపాటి నాగేశ్వరరావు, ప్రశాంతి తదితరులు ఉన్నారు.
- **కామవరపుకోట :** సార్వత్రిక ఎన్నికల్లో చింతలపూడి ఎమ్మెల్యేగా సొంగా రోషన్‌కుమార్ అఖండ విజయం సాధించిన నేపథ్యంలో గురువారం గుంటుపల్లి పంచాయతీ కంఠమనేనివారిగూడెంలో ఆత్మీయ అభినందన సభను ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ గోరింక దాసు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ హాజరవుతారని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.


ఏలూరులోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం, చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 19: దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరమని పలువురు నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో రాహుల్ జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు, నగర కార్యదర్శి ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ భారతదేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం ఎంతైనా అవసరమన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్‌గాంధీ ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుని మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో లంకా రామ్మోహన్, తాళ్ళూరి చక్రవర్తి, కొమ్మన సాంబశివరావు, దాసరి రాంప్రసాద్, సత్యనారాయణ, దండుబోయిన చంద్రశేఖర్, సాదే బాబూ ప్రసాద్, నల్లగట్ల అనాల్, కోసూరి చంద్రకాంతం, సేవాదళ్ నాయకులు కేఎస్ఎన్.మూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా పార్టీ మండల అధ్యక్షురాలు ముచ్చిక సీత ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ స్మారక వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేశారు. వృద్ధులకు పాలు పండ్లు అందజేశారు. ముచ్చిక సీత మాట్లాడుతూ దేశం కోసం జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ఎన్నో త్యాగాలు చేశారన్నారు. రానున్న రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తోలేటి రఘు, చిలకా రాంబాబు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు విస్సంపల్లి సుందరరావు ఆధ్వర్యంలో జరిగాయి. రాహుల్‌గాంధీ జోడోయాత్ర జరిపి ప్రజాదరణ పొందారని, బీజేపీకి గట్టిపోటీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు ఎస్.సుందర్‌రావు, కె.కృష్ణమూర్తి, బోసురెడ్డి, లింగాచారి, పోతురాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సీతామహలక్ష్మి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేశారు. వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్రబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, కొల్లి రామ నూరి రెడ్డి, బొడ్డు వాసు, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.



చనిపోతున్న రొయ్యలను పట్టుబడి చేస్తున్న దృశ్యం.

భారీ వర్షం..

విరిగిన చెట్ల కొమ్మలు.. తెగిన విద్యుత్ తీగెలు

ఆక్సిజన్ అందక చనిపోతున్న చేపలు, రొయ్యలు

కలిదిండి, జూన్ 19: కలిదిండిలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉప్పుటేరు వెంబడి ఉన్న మద్వానిగూడెం - మట్టగుంట ప్రధాన రహదారి గుర్వాయిపాలెం - మూల్లంక ప్రధాన రహదారి గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో చెరువులను తలపిస్తున్నాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడటంతో రొయ్యల చెరువుల్లో ఏరియేటర్లు నిలిచి ఆక్సిజన్ లోపించడంతో చెరు వుల్లో రొయ్యలు చనిపోతున్నాయని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. అద్దె జనరేటర్లను రొయ్యల చెరువుల వద్ద ఏర్పాటు చేసి ఏరియేటర్లను నిరంతరాయంగా తిప్పుతున్నారు. దీంతో అదన వ్యయమవుతోందని వాపోతున్నారు. పలు గ్రామాల్లో హడావిడిగా పట్టుబడి చేస్తున్నారు.

ఆక్వా రైతుల పాట్లు

మండవల్లి: బుధవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షం వల్ల ఆక్వా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటల వరకు వర్షం పడి అనంతరం ఉక్కపోతగా ఉండడంతో ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ సమస్య ఏర్పడి రొయ్యలు, చేపలు విలవిలలాడాయి. దీంతో రైతులు ఉరకలు పరుగుల మీద మందులు పిచికారీ చేశారు. వాతావరణం స్థిరంగా లేక ఆక్వా సాగు కత్తిమీద సాములా మారింది.



పొలంలో సాగులో ఉన్న పచ్చిరొట్ట

పచ్చిరొట్ట సాగు.. పంటలు బాగు

పశువుల సంఖ్య తగ్గిపోవడంతో నిస్సారంగా నేలలు

పచ్చిరొట్ట సాగుచేసి కలియదున్నటంతో పొలాలకు దన్ను

50 శాతం సబ్సిడీపై విత్తనాలు

మొగ్గుచూపుతున్న రైతులు

గ్రామాల్లో పశు పోషణ భారంగా మారడంతో పశువుల పెంపకం తగ్గింది. దీంతో భూములకు పశువుల ఎరువు వేయకపోవటంతో నిస్సారంగా మారి పంటల దిగుబడులు నాణ్యత తగ్గిపోతున్నది. దీనిని అధిగమించి నేలలను సారవంతం చేసుకోటానికి పచ్చిరొట్ట సాగును చేట్టాలని రైతులకు వ్యవసాయాధికారులు కొన్నేళ్ళ నుంచి అవగాహన కల్పిస్తున్నారు.

(చాట్రాయి)

ఇటీవల కాలంలో పచ్చిరొట్ట ఉపయోగాలు తెలుసుకొంటున్న రైతులు దీని సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో సుమారు 6 వేల ఎకరాల్లో రైతులు పచ్చిరొట్ట సాగు చేపట్టడం విశేషం. రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తుండటంతో పచ్చిరొట్ట సాగు ఊపందుకుంది. పచ్చిరొట్ట సాగు వల్ల నేలకు సేంద్రియ కర్బనం అందుతుంది. నేల భౌతిక లక్షణాలను మెరుగుపరుస్తుంది. నేలలో ఉండే ప్రయోజనకర సూక్ష్మజీవుల సంఖ్యను గణనీయంగా పెంచుతుంది. వేసవిలో సంభవించే భారీ గాలులు, వర్షాల కోతను నివారిస్తుంది. రసాయనిక ఎరువుల వాడకాన్ని 15 నుంచి 25 శాతం వరకు తగ్గించటంలో సహాయపడుతుంది. కలుపు మొక్కల బెడద తగ్గిస్తుంది. పైర్లకు పోషకాల లభ్యతకు సహాయ పడుతుంది.

ఎప్పుడు విత్తుకోవాలి?

ఒకటి, రెండు తొలకరి వర్షాలు పడగానే పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకోవాలి. విత్తిన తరువాత 50 నుంచి 60 రోజుల వ్యవధి రాగానే నేలలో కలియదున్నాలి. పచ్చిరొట్ట దున్నటం వల్ల జీవ పదార్ధం వేగంగా కుళ్ళిపోవటానికి సహాయపడుతుంది.



నాణ్యమైన దిగుబడులు..

పచ్చిరొట్ట సాగు భూముల్లో నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి. నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు పంటలకు అంది రైతులకు లాభాలు వస్తాయి. ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు 50 శాతం సబ్సిడీతో జీలుగ 48 టన్నులు, పిల్లి పెసర 33.08, జనుము 35 టన్నులు పంపిణీ చేశాం.

\- శివశంకర్, వ్యవసాయాధికారి, చాట్రాయి మండలం



లాభాలు పొందుతున్నాం

భూములకు పశువుల ఎరువు వేయకపోవటంతో పంటల దిగుబడి తగ్గి కొన్నేళ్ళు నష్టపోయాం. పచ్చిరొట్ట సాగు మొదలు పెట్టిన తరువాత భూములు సారవంతమై పంటల దిగుబడుల నాణ్యత పెరిగి లాభాలు పొందుతున్నాం. పచ్చిరొట్ట సాగు రైతులకు మేలు చేస్తోంది.

\- ఈడా శ్రీనివాసరావు, రైతు, అరుగొలను పేట



తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో కాలువ పూడికతీత దృశ్యం

సొంత సొమ్ముతో కాలువ పూడికతీత

నడుం బిగించిన తెలుగు తమ్ముళ్లు

చాట్రాయి, జూన్ 19: తమ్మిలేరు ప్రాజెక్టు కుడి కాలువకు ఎన్నో ఏళ్ళుగా మరమ్మతులు లేకపోవడంతో మేటవేసి నీళ్ళు పారని పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి పార్థసారథి ఆదేశాల మేరకు టీడీపీ పోలవరం గ్రామ నాయకులు సొంత నిధులతో తమ్మిలేరు ప్రాజెక్టు కుడి కాలువలో పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు మాట్లాడుతూ ఈ కాలువ కింద పోలవరం చాట్రాయి, మర్లపాలెం గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల సాగుభూమి ఉందని, గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కాలువ శిథిలావస్థకు చేరి, భూములకు నీరందక రైతులు అనేక కష్టనష్టాలకు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చిన నేపథ్యంలో ఇక నుంచి వ్యవసాయానికి మహర్దశ రానున్నదని అన్నారు. టీడీపీ నాయకులు యర్రా హేమంత్ కుమార్, ప్రసాదరావు, సీతారామయ్య, రామ్మోహన్, రాజా, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు టౌన్, జూన్ 19: నూజివీడు పట్టణంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ సత్యనారాయణ తెలిపారు. విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా కోనేరుపేట, బ్యాంకుస్ట్రీట్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చాట్రాయి: పెద్దలైన్ల మరమ్మతుల నిమిత్తం మండలంలోని చీపురుగూడెం, పోలవరం సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ సంజయ్ తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

28న మల్లేశ్వరస్వామి భూముల లీజు వేలం

ముదినేపల్లి, జూన్ 19 : పెదగొన్నూరులోని మల్లేశ్వరస్వామి ఆలయ భూమి 5.96 ఎకరాలను వరి సాగుకు మూడేళ్ల కాలపరిమితికి లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 28న దేవస్థానం కార్యాలయం వద్ద బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఇవో ఎస్.కె.కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు ధరావతు చెల్లించి వేలంలో ఈఓ కోరారు.



నరసింహారావును సత్కరిస్తున్న దృశ్యం

టీడీపీ నాయకులకు సత్కారం

ముదినేపల్లి, జూన్ 19 : కైకలూరు ఎమ్మెల్యేగా డాక్టర్ కామినేని శ్రీనివాస్ విజయానికి కృషి చేసిన కూటమి నాయకులను బుధవారం సన్మానించారు. ఎన్‌డీఏ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన కొడాలి వినోద్‌ను ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయ ఏవో రమణబాబు, మండలంలోని వీఆర్‌ఏలు, ముదినేపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్ సత్కరించారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావును వడాలి గ్రామ సచివాలయ కార్యదర్శి జి.రమేష్, సిబ్బంది సత్కరించారు. మండలంలో కూటమి అభ్యర్థికి పది వేల ఓట్లకు పైగా మెజారిటీ రావటంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



కైకలూరులో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరులో అన్న క్యాంటీన్ ప్రారంభం

కైకలూరు, జూన్ 19: పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లు సైతం గత ప్రభుత్వం మూసివేయడం దుర్మార్గమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో కైకలూరు తాలుకా సెంటర్లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను కామినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అన్నక్యాంటీన్ల బాధ్యత నిర్వహించే వరకు ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసి కూటమి ఆధ్వర్యంలో నిత్యం పేదలకు అన్నక్యాంటీన్ ద్వారా భోజనాన్ని అందిస్తారన్నారు. ధనిక కుటుంబాలకు చెందిన వారు పిల్లల పుట్టినరోజులకు వృథాగా ఖర్చు చేయకుండా అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనాన్ని అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కైకలూరు సర్పంచ్ నవరత్నకుమారి పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

సబ్సిడీపై అందించే వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని కామినేని అన్నారు. బుధవారం వరహా పట్నంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా ఆధ్వర్యంలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి సమీక్షా సమావేశం నిర్వహించారు.



విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో చాముండేశ్వరి

విత్తన దుకాణాల్లో తనిఖీలు

నూజివీడు టౌన్, జూన్ 19: వర్షాకాలం ప్రారంభమై వ్యవసాయ పనులు వేగవంతం అవుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా వ్యవసాయాధికారులు విత్తన దుకాణాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. బుధవారం నూజివీడు మండల వ్యవసాయాధికారిణి ఆలూరి చాముండేశ్వరి, నూజివీడు పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో విత్తన శాంపిళ్ళను సేకరించారు. విత్తన విక్రయాల రికార్డులను ఆమె పరిశీలించారు.

చాట్రాయి: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని చాట్రాయి మండల వ్యవసాయాధికారి శివశంకర్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద కొనుగోలు చేయాలని, అందుకు తగ్గ బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తనాలు పొలంలో చల్లే ముందు మొలకశాతం పరీక్ష చేసుకోవాలని, ఎమ్మార్పీ ధరలకు మించి వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు తమ వద్ద ఉన్న సరుకు వివరాలు, ధరలు ప్రతిరోజూ బ్లాక్‌బోర్డుపై రాయాలని ఆదేశించారు.

ఆ పోలీసులపై చర్యలు చేపట్టండి..



నూజివీడు టౌన్, జూన్ 19: గత ప్రభుత్వం హయాంలో రైతులపై అక్రమ కేసులు పెట్టిన పోలీసులపై చర్య తీసుకోవాలని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ కోరారు. బుధవారం అమరావతి సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను కలసిన ఆయన మల్లవల్లి ఇండస్ట్రీయల్ కారిడార్ భూ నిర్వాసిత రైతుల విషయమై మాట్లాడారు. గత ప్రభుత్వంలో రైతులపై లాఠీఛార్జ్ చేసి గాయపరిచి, అక్రమంగా హత్యా కేసులు నమోదు చేశారని, ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకో వాలని కోరారు. జనసేన నాయకుడు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రకు ముద్దరబోయిన అభినందన



నూజివీడు, జూన్ 19: ప్రజా సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వర రావు అన్నారు. రాష్ట్ర మంత్రిగా ఎన్నికైన మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్రను బుధవారం ముద్దరబోయిన కలసి అభినందనలు తెలిపారు. అనంతరం ముద్దరబోయిన మాట్లాడుతూ గత ప్రభుత్వం మద్యం పాలసీ పేరుతో నాసిరకం మద్యాన్ని తీసుకువచ్చి అనేక మంది ఆడపడుచుల ఉసురు తీసిందన్నారు. మద్యం పాలసీపై విచారణ చేసి నాసిరకం మద్యాన్ని అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.



తాగునీటి చెరువు తవ్వకం పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కలిదిండి, జూన్ 19 : తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కోరుకొల్లులో పంచాయతీ ఊర చెరువులను తాగునీటి చెరువులు మార్పు చేసేందుకు చెర్వుల తవ్వకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో విడతల వారీగా తాగునీటి సమస్య పరిష్కరించటమే తన లక్ష్యమన్నారు. రంగు మారిన తాగునీటి చెరువుల్లో నీటిని ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయించి క్లోరినేషన్ చేయించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, మాజీ ఎంపీపీలు వలవల రామారావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ, కోరుకొల్లు సర్పంచ్ కనకదుర్గ, ఎంపీటీసీలు తోట రమాదేవి, చెన్నంశెట్టి శిరీష, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సూరేపల్లిలో పాడి రైతులతో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

పాడిరైతుల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యం

ముసునూరు, జూన్ 19: పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యమని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం సూరేపల్లి గొల్లగూడెంలోని పాల సొసైటీని ఆయన సందర్శించి మాట్లాడుతూ యూనియన్ ద్వారా పశువులకు అవసరమైన పౌష్టికాహారం, వైద్యం, మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. పాల దిగుబడి పెంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. సొసైటీ అధ్యక్షుడు బి. శ్రీనివాసరావు, మేనేజర్ హరి తదితరులు పాల్గొన్నారు.



ఈడేపల్లిలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్, టీడీపీ నాయకులు

పవన్ కల్యాణ్ బాధ్యతల స్వీకారంపై సంబరాలు

ముదినేపల్లి, జూన్ 19 : ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఈడేపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు పాలకవర్గం కేక్ కట్ చేసి పవన్‌కు అభినందనలు తెలిపారు. తెలుగుదేశం, జనసేన నాయకులు బండారు శ్రీరంగ రాజు, బండి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ వెంకటేశ్వరరావు గ్రామస్థులకు డస్ట్ బిన్లు పంపిణీ చేశారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నూజివీడు, జూన్ 19: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.డి. రవికుమార్ ఆధ్వర్యంలో నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసిన అనంతరం రవికుమార్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీని భవిష్యత్తులో ప్రధానిగా చేసుకు నేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పరిమి సాగర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సోమరాజు, శివశంకర్, పాలడుగు నాగభరత్, నూజివీడు, ముసునూరు మండలాల పార్టీ అధ్యక్షులు పల్లెపాం ప్రసాద్, సూర్యదేవరప్రసాద్, విఠల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



కైకలూరు, జూన్ 19: కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించగా 7 లక్షల 63 వేల 447 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కేవీ గోపాలరావు తెలిపారు. బుధవారం ఎండోమెంట్ తనిఖీ అధికారి వి. సుధాకర్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపును నిర్వహించారు. 62 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో కొబ్బరి చెక్కలను పోగుచేసుకునే హక్కు కోసం వేలం నిర్వహించగా పాటదారులు ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ఆగిరిపల్లి, జూన్ 19: అడవినెక్కలంలో ఈ నెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్‌ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నాలుగో సంవత్సరం విద్యార్థి సంపంగి ఈశ్వరరావు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం నాడు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నూజివీడు టౌన్, జూన్ 19: నూజివీడు మండలం గొల్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గొల్లపల్లికి చెందిన సుదర్శన్‌రావు, హాసిని ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రైవేట్ బస్సు వీరి వాహనాన్ని వెనుక నుంచి ఢీకొనడంతో వీరు గాయాలపాలవ్వగా సుదర్శన్‌రావును మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అన్నవరం పాఠశాలలో ఎంపీటీసీ వెంకయ్య పుస్తకాల పంపిణీ



దొడ్డిపట్ల హైస్కూల్లో పంపిణీ చేస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ



రమణక్కపేటలో పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

సర్కారు విద్యను వినియోగించుకోవాలి

చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చాలి

ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీలో వక్తలు

చాట్రాయి, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి తల్లిదండ్రులు సర్కార్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు కోరారు. చనుబండ జడ్పీ హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడుతూ అర్హత కలిగిన ఉపాధ్యాయుల బోధన నుంచి సకల సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. నరసింహారావుపాలెం జిల్లా పరిషత్ తదితర పాఠశాలల్లో టీడీపీ నాయకులు పుచ్చకాయల నోబుల్‌రెడ్డి, గార్లపాటి మారేష్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు జ్యోతి, ప్రశాంతి, ఎంపీటీసీ సోని, ఆనంద్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: ప్రజాధనం నిరుపయోగం కాకుండా గత ప్రభుత్వం గోదాములలో నిల్వ ఉంచిన పాఠ్య పుస్తకాలు, స్కూల్‌కిట్లను విడుదల చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాధనం విలువను వైసీపీ నాయకులకు తెలియజేశారని అన్నవరం ఎంపీటీసీ దువ్వూరి వెంకయ్య అన్నారు. అన్నవరం జడ్పీ హైస్కూలులో కిట్లు, పాఠ్య పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. అన్నవరం ఉప సర్పంచ్ చలసాని గోపాలకృష్ణ, హెచ్‌ఎం జి.విజయ్‌కుమారి పాల్గొన్నారు. పోతురెడ్డిపల్లిలో సర్పంచ్ సుజాత, పాఠశాల కమిటీ చైర్మన్ డేవిడ్ పుస్తకాలు పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షులు అక్కినేని బెనర్జీ, హెచ్‌ఎం జయమణి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్, జనసేన నియోజకవర్గ నాయకులు పాశం నాగబాబులు అన్నారు. బుధవారం రమణక్కపేట జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం పీవీఎస్ రామకృష్ణరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంపీపీ, జనసేన, టీడీపీ నాయకులు పుస్తకాలను అందజేశారు. టీడీపీ నాయకులు రంగు వెంకటేశ్వరావు, గోళ్ళ గురునాథం, విద్యాకమిటీ చైర్మన్ రంగు మురళీకృష్ణ, పీడీ వాకా నాగరాజు, ఉపాధ్యాయులు టి.రామారావు, షకీల తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర, నెక్కలం జిల్లా పరిషత్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈదర సర్పంచ్ దొండపాటి అనిత, హెచ్‌ఎం శారద, పాఠశాల చైర్‌పర్సన్ అంజి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య నోటు పుస్తకాల పంపిణీ చేస్తున్నారు. మండలంలోని సుమారు 5 వేల మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు సరఫరా కాగా, హైస్కూళ్లలో 6 నుంచి పదవ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు కూడా పంపిణీ చేస్తున్నారు. పాఠశాలల వారీగా పుస్తకాల కేటాయింపులు పూర్తయ్యా యి. పుస్తకాల పంపిణీ మంగళవారం ఎమ్మెల్యే కామినేని ప్రారంభించగా, బుధవారం పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు.

కైకలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. బుధవారం కైకలూరు మండలం దొడ్డిపట్ల జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు, హెచ్‌ఎం కట్టా విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు పాలొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోను ఉచితంగా పుస్తకాలు

కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి ఉచితంగా పాఠ్య, నోటుపుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి తెలిపారు. ప్రభుత్వం విడుదల జీవోనెం 28 ప్రకారం ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్య కొరకు కావాల్సిన పుస్తకాలను అందిస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రభుత్వ కళాశాలల్లో చేరి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. అడ్మిషన్లు తదితర వివరాలకు సెల్ 94949 11486లో సంప్రదించాలన్నారు.



పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పుస్తకాల పంపిణీ